సాక్షి సిద్దిపేట

శుక్రవారం ׀ 18 ׀ ఆగస్టు ׀ 2023



ఎక్సైజ్‌కు కాసుల కిక్కు

సిద్దిపేట ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురుస్తోంది. వైన్ షాప్‌ల దరఖాస్తుల ద్వారా ఇప్పటి వరకు రూ. 42.28కోట్ల ఆదాయం వచ్చింది. 8లో..



వ్యవసాయం పరిశ్రమలా మారాలి

రాష్ట్రంలో వ్యవసాయం ఒక పరిశ్రమలా మారాలని ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లి వచ్చిన రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి తెలిపారు. 8లో..

దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు తరువాత రెండు రోజుల పాటుగా సవరణలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

తిగుల్‌లో నేడు షర్మిల పర్యటన

జగదేవ్‌పూర్(గజ్వేల్): వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో పర్యటించనున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామలింగారెడ్డి, మండలాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. గ్రామంలో దళితుల పరిస్థితులు తెలుసుకోవడానికి ఆమె వస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ చౌరస్తా వద్ద దళితులతో సమావేశం అవుతారని చెప్పారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న పీడీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల, గోనెపల్లి, కస్తూరిపల్లి గ్రామాలను గురువారం డీఆర్‌డీఓ పీడీ చంద్రమోహన్ రెడ్డి సందర్శించారు. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంప్ యార్డులు, నర్సరీలు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. హరితహారంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య, ఎంపీఓ సోమిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు నిర్వహిస్తున్న నూతన లైన్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పటేల్‌పుర, అంబేద్కర్‌నగర్, సంజీవయ్యనగర్, సాజీద్‌పుర, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బోయగల్లి, వీవీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సభ్యత్వ నమోదు

సిద్దిపేటరూరల్: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ డిమాండ్ చేశారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటీరియల్ రిలీఫ్ ప్రకటించి, పీఆర్‌సీ కమిటీని నియమించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, ఎన్. కిషన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హిమోగ్లోబిన్ పరీక్షలు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని కేజీబీవీ మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ విద్యాలయాలు, ఎస్సీ, బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశాల మేరకు మూడు రోజులపాటు విద్యార్థులకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు గురువారం 24 పాఠశాలల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి ఐరన్, పోలిక్ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. తీవ్ర రక్తహీనత ఉన్న 15 మంది పిల్లలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. ప్రతీ గురువారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మాత్రలు అందిస్తామని తెలిపారు.

సినిమా షూటింగ్ సందడి



షూటింగ్ ప్రారంభిస్తున్న గీస భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయ పరిసరాలు 'దుమారం' సినిమా షూటింగ్‌తో సందడిగా మారాయి. గురువారం ఆలయ చైర్మన్ గీస భిక్షపతి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఇక్కడ మూడు రోజులపాటు షూటింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చేర్యాలకు చెందిన ఘన యాది రాసిన 'నే చంగుమంటూ చిందులేస్తే దుమ్ము దుమ్ము దుమారం' అనే టైటిల్ సాంగ్‌ను చిత్రీకరించారు. ప్రధాన పాత్రలో హీరో సుమన్ నటిస్తున్నారు. కార్యక్రమంలో దర్శకులు జీఎల్‌బీ శ్రీనివాస్, నిర్మాత రాజు, కొంపాక కనకయ్య పాల్గొన్నారు.

పరిశ్రమల పరుగు

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విధానం 'టీఎస్ ఐపాస్' కింద పరిశ్రమల స్థాపన జోరందుకుంది. సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో గజ్వేల్‌లో వెల్లువలా కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. పరిశ్రమల స్థాపనకు భూ సమస్య రాకుండా ప్రభుత్వం పక్కా చర్యలు చేపడుతుండటంతో కొత్తకొత్త కంపెనీల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు.

- గజ్వేల్ నియోజకవర్గంలో భారీ కంపెనీలు
- తున్కిబొల్లారంలో ఇండస్ట్రియల్ పార్క్
- వర్గల్‌లో ఫుడ్ పార్కు విస్తరణ
- బండమైలారంలో కోకాకోలా కంపెనీ
- మరిన్న కొత్త పరిశ్రమల స్థాపనకు అవకాశం



ములుగు మండలం తున్కిబొల్లారంలో పరిశ్రమలు

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత 'ఇలాఖా' గజ్వేల్ నియోజకవర్గంలో పరిశ్రమల విప్లవం నడుస్తోంది. వేగవంతంగా వీటి స్థాపన జరుగుతోంది. కొల్లకల్, కర్కపట్లలో రెండు పారిశ్రామిక వాడలుండగా, కొత్తగా ఏర్పాటైన తున్కిబొల్లారం, వర్గల్, బండమైలారం టీఎస్ఐఐసీ పార్కుల్లోనూ పరిశ్రమల స్థాపన ఊపందుకుంది. ఇందులోభాగంగానే బండమైలారంలో రూ.1200కోట్లతో ప్రతిష్టాత్మక కోకాకోలా కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌ను ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ సంకల్పించారు. సీఎం ఆదేశాలతో ఇప్పటికే ములుగు మండలంలోని తున్కిబొల్లారంలో 443ఎకరాల భూసేకరణ జరిగింది. ఇందులో ఇప్పటికే టీఎస్ఐఐసీ ద్వారా 65కు పైగా పరిశ్రమలకు భూములు కేటాయించారు. రెండున్నరేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వీరికి 2నుంచి 10ఎకరాలు ఆపైనా ఎకరాకు రూ.1.20కోట్లకు అప్పగించారు. ఇందులో ముఖ్యంగా సీడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, ఫ్యాబ్రికేషన్, జనరల్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్ కాంపోనెంట్ తదితర పరిశ్రమల పనులు చురుకుగా సాగుతుండగా, కొన్ని పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభమైంది. ఇకపోతే వర్గల్–ములుగు గ్రామాల మధ్య మరో 1140ఎకరాల భూమిని టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో సేకరించిన విషయం విధితమే. ఇందులో ఇప్పటికే 30వరకు యూనిట్లకు భూములు కేటాయించారు. దక్షిణాదిలోని అతిపెద్దదిగా చెప్పుకుంటున్న అమూల్ ప్లాంటుకు 50ఎకరాలు కేటాయించగా పనులు జరుగనున్నాయి. ఈ భూములను పూర్తిగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే గతేడాది దరఖాస్తు చేసుకున్న వీరికి ఎకరాకు రూ.75లక్షల చొప్పున 2 నుంచి 50 ఎకరాల వరకు కేటాయిస్తున్నారు. మరో 100కు పైగా ఇక్కడ పరిశ్రమలు రానున్నాయి. దీంతో నిరుద్యోగ యువత ఉపాధికి మార్గం సుగమం కానుంది. ఇప్పటికే నియోజకవర్గంలోని ములుగు మండలం దామరకుంట, కర్కపట్ల, తూప్రాన్ మండలం కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటైన సంగతి విధితమే.

రూ.1200కోట్లతో కోకాకోలా కంపెనీ

ములుగు మండలం బండమైలారం టీఎస్ఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో ప్రతిష్టాత్మక కోకాకోలా పరిశ్రమ రాబోతుంది. ఇక్కడ 400ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకాగా, కోకాకోలాతోపాటు మరిన్ని బడా కంపెనీలకు భూములు కేటాయించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కోకాకోలా పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని ఈనెల 11న గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాగా కొత్త పరిశ్రమల స్థాపనకు హైదరాబాద్ తర్వాత గజ్వేల్ ప్రాంతమే ప్రత్యామ్నాయంగా మారుతోంది. నగరానికి అతిసమీపంలో ఉండటం, ఇక్కడ నుంచి ట్రిపుల్‌ఆర్ నిర్మాణం, రైల్వేలైన్ కూడా అందుబాటులోకి రావడం కలిసి వస్తుంది.

> **గజ్వేల్‌పై ప్రత్యేక దృష్టి**
>
> సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే ఈ ప్రక్రియ వేగంగా సాగుతోంది. కోకాకోలాతోపాటు మరిన్ని పెద్ద కంపెనీలు వచ్చే అవకాశముంది. దీని ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
>
> – బాలమల్లు, టీఎస్ఐఐసీ చైర్మన్

జగ్గారెడ్డిని చేర్చుకోవద్దు

- హరీశ్‌రావును కోరిన బీఆర్ఎస్ శ్రేణులు
- ప్రభాకర్‌కే టిక్కెట్ ఇవ్వాలని విజ్ఞప్తి
- సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న హరీశ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకోవద్దని కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు మంత్రి హరీశ్‌రావును కలసి విజ్ఞప్తి చేశాయి. సుమారు రెండొందల మంది ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసిన జగ్గారెడ్డి తెలంగాణ ప్రజలను మోసం చేశారని, గత ఎన్నికల్లో బోగస్ హామీలు ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన నియోజకవర్గ ప్రజలను కూడా మోసం చేశారని ఆరోపించారు. అలాంటి వారిని పార్టీలోకి తీసుకోవద్దని కోరారు. నాలుగున్నరేళ్లు ఏనాడు నియోజకవర్గం ప్రజలను పట్టించుకోని జగ్గారెడ్డిని చేర్చుకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రానున్న ఎన్నికల్లో సంగారెడ్డి టిక్కెట్ మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కే కేటాయించాలని కోరారు. ఆయన ప్రజల్లో ఉంటున్నారని, నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చింత ప్రభాకర్‌కు టిక్కెట్ ఇస్తే.. పార్టీ శ్రేణులంతా కలిసి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళతానని మంత్రి హరీశ్ అన్నట్లు పార్టీ ముఖ్యనాయకులు పేర్కొంటున్నారు. హరీశ్‌రావును కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతుబంధు కమిటీ నేతలు, నాయకులు ఉన్నారు.

గతంలో ఏకగ్రీవ తీర్మానం

జగ్గారెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దని కోరుతూ నెల రోజుల క్రితం సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముఖ్యనేతలంతా సంగారెడ్డిలో సమావేశమైన విషయం విదితమే. జగ్గారెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దని అప్పట్లో ఏకగ్రీవ తీర్మానం కూడా చేశారు. త్వరలోనే జగ్గారెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా కలసి మంత్రి హరీశ్‌రావు వద్దకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.



హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసిన సంగారెడ్డి బీఆర్ఎస్ ముఖ్యనేతలు, కార్యకర్తలు

కాంగ్రెస్‌తోనే పథకాల అమలు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు వాటిని అమలు చేయడం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. నాలుగో రోజు గురువారం మండలంలోని కొక్కొండ, బస్వాపూర్ గ్రామాలలో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల అభ్యున్నతికి కృషి జరిగిందన్నారు. ఆత్మగౌరవ యాత్రకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై మండిపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, నాయకులు గణేష్‌యాదవ్, కర్ణాకర్‌గౌడ్, రవీందర్, రాజుయాదవ్, నహిమొద్దీన్ పాల్గొన్నారు.

తీజ్ సంబురం



మండలంలోని మసిరెడ్డి తండా, దుబ్బతండా గ్రామ పరిధిలోని వంకాయ తండాలో గిరిజనులు తీజ్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం గిరిజన యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి గోధుమల మొలకలను సమీప చెరువులో వదిలి పూజలు చేశారు.

అక్కన్నపేట(హుస్నాబాద్)

జనగామ.. జగడం!

- హైదరాబాద్‌కు చేరిన బీఆర్ఎస్ టికెట్ పంచాయితీ
- ముత్తిరెడ్డికే ఇవ్వాలని పార్టీ మండల కమిటీల తీర్మానాలు
- ర్యాలీగా హైదరాబాద్‌కు వెళ్లి ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం
- హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో భేటీ అయిన ముత్తిరెడ్డి వ్యతిరేక వర్గం



చేర్యాల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతున్న ముత్తిరెడ్డి వర్గీయులు

సాక్షి, సిద్దిపేట: జనగామ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టికెట్ల లొల్లి మొదలైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు చేయాలని కొందరు, ముత్తిరెడ్డికే ఇవ్వాలని మరికొందరు నేతలు పట్టుబడుతున్నారు. ముత్తిరెడ్డి అనుకూల వర్గం, వ్యతిరేక వర్గం పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ పంచాయితీ హైదరాబాద్‌కు చేరింది.

రెండు వర్గాలుగా..

జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ రెండు వర్గాలుగా విడిపోయింది. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిల అనుచరులు రెండు గ్రూపులు ఏర్పడి ఢీ అంటే ఢీ అంటున్నారు. జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌కు మా నాయకుడికే ఇవ్వాలని మీటింగ్‌లు పెట్టి తీర్మానాలు చేస్తున్నారు.

పోటాపోటీగా..

రెండు వర్గాలు పోటాపోటీగా సమావేశం అవుతున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ప్రగతి భవన్ సమీపంలో ఓ హోటల్‌లో ముత్తిరెడ్డి వ్యతిరేకవర్గం మద్దూరు ఎంపీపీ బద్దిపడగ క్రిష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు శ్రీధర్ రెడ్డి, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు భేటీ అయ్యారు.

గురువారం ముత్తిరెడ్డి వర్గీయులు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండల కమిటీలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ తరఫున ముత్తిరెడ్డికే టికెట్ ఇవ్వాలని తీర్మానం చేశారు. అనంతరం ర్యాలీగా హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. తరలిన వారిలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం చైరన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, రాష్ట్ర నాయకులు ముస్త్యల బాల్‌నర్సయ్య, ఏకానందం, అనంతుల మల్లేశం, మేక సంతోష్, మంద యాదగిరి తదితరులు ఉన్నారు.

> **ఆశావహులు ఎక్కువే..**
>
> జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తున్నవారు ఎక్కువగానే ఉన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, ఎమ్మెల్సీ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్సీ రాజలింగం కుమారుడు కిరణ్‌కుమార్‌గౌడ్ టికెట్ ఆశిస్తున్నారు. టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఎవరికి వారు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు బీఆర్ఎస్ నేతలతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు మండలాల వారీగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజలింగం కుమారుడు కిరణ్ తనకు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ ప్రకటించే మొదటి జాబితాలో జనగామ టికెట్‌ను పెండింగ్‌లో పెడతారో ఎవరికైనా ప్రకటిస్తారో వేచి చూడాలి.

మూడోసారి గెలిచి చరిత్ర సృష్టిస్తాం

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి నాగలి బహూకరిస్తున్న పార్టీ కార్యకర్తలు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి, మిరుదొడ్డి మండలాలలకు చెందిన బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులకు ఎనగుర్తి శివారులోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పునాదులని అన్నారు. సీఎంగా కేసీఆర్ మూడోసారి గెలిచి చరిత్ర సృష్టిస్తారని తెలిపారు. బీజేపీ మాయమాటలతో ఉప ఎన్నికల్లో గెలిచి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీజేపిని ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. స్వరాష్ట్రంలో కరెంట్ కోతలు తప్పాయన్నారు. మల్లన్న సాగర్, కాళేశ్వరం ప్రాజెక్టులతో బీడు భూములన్నీ సాగులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జీడిపల్లి రవి, అంజిరెడ్డి, జెడ్పీటీసీ రవీంద్‌రెడ్డి, మిరుదొడ్డి జెడ్పీటీసీ లక్ష్మి, ఎంపీపీలు పుష్పలత, సాయిలు, డీసీఎంఎస్ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ జ్యోతి, సర్పంచ్‌లు స్వరూప, రాములు, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ప్రారంభం

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీకి రూ.72 లక్షల నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్, 2 చెత్త వాహనాలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక, లచ్చపేట మధ్య ఉన్న రోడ్డు చెరువుకట్ట నుంచి వస్తున్న జాలు నీటి కోసం ప్రత్యేక డ్రైనేజీ, ధర్మాజీపేట, చెల్లాపూర్, దుంపలపల్లి రోడ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో సొంత నిధులతో దివ్యాంగులకు వాహనాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవిందర్‌రెడ్డి, కమిషనర్ గణేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులకు న్యాయం చేయాలి: బీజేపీ


సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించి న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ కమిటీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అర్హులైన బీసీలకు లక్ష రూపాయలు అందించాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని చెప్పి రూ.3లక్షలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

ఎన్నికల ప్రక్రియపై అవగాహన


కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: అధికారులందరూ ఎన్నికల నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాల వారీగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.67 కోట్లతో జరుగుతున్న పీఆర్ రోడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో కొత్తగా నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 5వ తేదీన ఇంటిగ్రేటెడ్ (ఐటీసీ) బిల్డింగ్‌ను ప్రారంభిస్తామని, త్వరలోనే అక్కన్నపేట మండలం మల్లారంలో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో హుస్నాబాద్ కొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పత్తి పంటను దున్నేశారు..

సోదరుడిపై ఫిర్యాదు



గౌతాపూర్‌లో అక్రమంగా అంజిరెడ్డి దున్నిన మాణిక్యరెడ్డి పొలం

చిలప్‌చెడ్(నర్సాపూర్): తమ్ముడు సాగు చేసుకుంటున్న పత్తి పంటను అన్న, అతని కొడుకుతోపాటు మరో ఇద్దరు కలిసి దున్నేశారు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ గ్రామంలో గురువారం వెలుగు చూసింది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వెంకటపతి మాణిక్యరెడ్డికి ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న 34 సర్వే నంబర్‌లో 3.24 ఎకరాల పట్టా భూమి ఉంది. బుధవారం రాత్రి సోదరుడు అంజిరెడ్డి, అతని కొడుకు శ్రీనివాస్ రెడ్డి, మరో ఇద్దరు నిహాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పంటను దున్నేశారు. ఈ విషయమై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు చేశాడు.

మైనర్‌ను పెళ్లాడిన యువకుడిపై కేసు

చిన్నశంకరంపేట(మెదక్): బాలికకు మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకున్న యువకుడిపై గురువారం కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని జంగరాయి తండాకు చెందిన మోహన్, ఓ బాలికను మూడు రోజుల క్రితం తీసుకువెళ్లి పెళ్లి చేసుకున్నాడని తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్టు చేశారు. మైనర్‌ను వైద్య పరీక్షల కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

మూర్ఛతో రైతు మృతి



చాకలి దుర్గయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫిట్స్‌తో ఓ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని గౌతాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య(55) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన పంటను పరిశీలించేందుకు వెళ్లి తిరిగొచ్చే క్రమంలో ఫిట్స్‌తో కాలువలో పడి మృతిచెందాడు.

మహిళ ఆత్మహత్య



కందుకూరి సునీత

పటాన్‌చెరు టౌన్: మానసికస్థితి సరిగా లేని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మోహన్ కథనం ప్రకారం.. శ్రీరామ్‌నగర్ కాలనీలోని పద్మావతి అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న ఆనంద్ బాబు, సునీత(40) భార్యాభర్తలు. కొంతకాలంగా సునీత మానసిక స్థితి సరిగాలేక వైద్యుడి సూచన మేరకు మాత్రలు వాడుతోంది. గురు వారం ఉదయం బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కిడ్నాప్, పోక్సో కేసు

మద్దూరు(హుస్నాబాద్): బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన మైనర్ పాఠశాల నుంచి ఇంటి వెళ్తుండగా రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన పోతురాజు ప్రశాంత్(26) కిడ్నాప్ చేయడం తెలిసిందే.

ఎక్సైజ్‌కు కాసుల కిక్కు

- గతం కంటే ఎక్కువ దరఖాస్తులు
- 2021లో నాడు 1,755 దరఖాస్తులు.. నేడు 2,114
- తిగుల్ నర్సాపూర్‌లోని వైన్స్‌కు పోటీ పడుతున్న 110 మంది
- నేటితో ముగుస్తున్న గడువు



వైన్‌షాప్‌ల కోసం దరఖాస్తు చేస్తున్న మద్యం వ్యాపారులు

సాక్షి, సిద్దిపేట : ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురుస్తోంది. వైన్ షాప్‌ల దరఖాస్తుల ద్వారా ఇప్పటి వరకు రూ 42.28కోట్ల ఆదాయం వచ్చింది. 2023–25 సంవత్సరానికి కేటాయింపు కోసం ఈ నెల 4వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణ ముగయనుంది. ఈనెల 21న లక్కీ డ్రా తీసి కేటాయింపులు చేయనున్నారు.

గతం కంటే 412 దరఖాస్తులు అధికం

2021–23 సంవత్సరానికి 93 వైన్‌షాప్‌ల కేటాయింపు కోసం 1,755 దరఖాస్తులు వచ్చాయి. 2023–25 సంవత్సరానికి కేటాయింపు కోసం ఈ నెల 17 వరకు 2,114 దరఖాస్తులు వచ్చాయి. గతంతో పోల్చితే ఇప్పటికే 359 దరఖాస్తులు అధికంగా వచ్చాయి. శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణ ముగయనుంది. గురువారం ఒక్కరోజే 788 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు భారీగా దరఖాస్తు చేసే అవకాశం ఉంది. భారీగా దరఖాస్తులు వస్తుండటంతో జిల్లా ఎక్సైజ్ శాఖ ఖుషీగా ఉన్నారు.

ఒక్క షాప్‌కే 110 దరఖాస్తు

జగదేవ్‌పూర్ మండలంలో కొండపోచమ్మ దేవాలయం సమీపంలోని తిగుల్‌నర్సాపూర్ గ్రామంలో వైన్ షాప్‌కు ఇప్పటి వరకు 110 మంది దరఖాస్తు చేశారు. గురువారం ఒక్కరోజే 30 మంది దరఖాస్తు చేశారు. 2021 డిసెంబర్ 1 నుంచి జూలై 31, 2023 వరకు రూ.31.71 కోట్ల వ్యాపారం జరిగింది. కొమురవెల్లి దేవాలయానికి వచ్చిన భక్తులు మార్గం మధ్యలో కొండ పోచమ్మను దర్శించుకుని విందులు చేసుకుంటారు. దీంతో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ అధికంగా లాభాలుంటాయని ఉద్దేశంతో లక్కును మద్యం వ్యాపారులు చెక్ చేసుకోనున్నారు.

తమ్ముడు.. జగ్గారెడ్డి పార్టీలోకి రా..!

కేఏ పాల్ పిలుపు



మాట్లాడుతున్న కే.ఏ పాల్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తమ పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ్ముడు జగ్గారెడ్డి.. ''రూ.వెయ్యి కోట్లు తీసుకొని స్వార్థం కోసం బీఆర్‌ఎస్‌లో చేరుతావో.. సంగారెడ్డి అభివృద్ధి కోసం ప్రజాశాంతి పార్టీలోకి వస్తావో నిర్ణయించుకోవాలని''సవాల్ విసిరారు. జగ్గారెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరితే నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న చింతప్రభాకర్ పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభాకర్ తన పార్టీలోకి వస్తే ఏటా రూ.కోటి తన సొంత నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు.

లిక్కర్ స్కాం కేసుపైనా వ్యాఖ్యలు

లిక్కర్ స్కాంలో కవితను అరెస్టు అంశాన్ని కూడా కేఏ పాల్ ప్రస్తావించారు. కేసీఆర్ తన కూతురు కవితను అరెస్టు చేయకపోతే బీజేపీకి 40 సీట్లు ఇస్తానని అన్నారని పాల్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ బీజేపీకి బీ టీం అని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన స్వార్థం కోసం టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారని పాల్ ఆరోపించారు. రూ.వేల కోట్లు సంపాదించుకున్న రేవంత్‌కు ఓటు బ్యాంకు లేదన్నారు.

గుండెపోటుతో లైబ్రేరియన్ మృతి

అల్లాదుర్గం(మెదక్): స్థానిక గ్రంథాలయ లైబ్రేరియన్‌గా గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. టేక్మాల్ మండలంలోని వేల్పుగోండ గ్రామానికి చెందిన లక్ష్మయ్య(55) గ్రంథాలయంలో పదేళ్లగా లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం వేల్పుగోండలో వ్యవసాయ పనులు చేసుకొని ఇంటికి వచ్చాడు. వెంటనే చాతిలో నొప్పితో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

సోషల్ మీడియాకు దూరం ఉండాలి

పోలీస్ కమిషనర్ శ్వేత

కోహెడరూరల్(హుస్నాబాద్): మహిళలు, విద్యార్థినిలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సిద్దిపేట సీపీ శ్వేత సూచించారు. మండలంలోని నాగసముద్రాల గ్రామంలో మోడల్‌స్కూల్‌లో మహిళ రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మొద్దన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. బాలికల, మహిళ రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలు రూపొందించిందన్నారు. అలాగే షీటీం కంప్లెయింట్ క్యూఆర్ కోడ్ ద్వారా ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, ఎస్‌ఐ తిరుపతి తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా ఛేదించాలి

హుస్నాబాద్: వార్షిక తనిఖీల్లో భాగంగా కోహెడ పోలీస్ స్టేషన్, హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం రాత్రి సీపీ శ్వేత సందర్శించారు. పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి కోహెడ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సీజ్ చేసిన, అబ్బాండెడ్ వాహనాలను త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు. అలాగే హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరగా ఛేదించాలని ఎస్సైలకు సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు ప్రతినెలా అందిస్తామన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, కోహెడ ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ సర్వేతో ఆగిన రైతు గుండె

తమ భూముల్లో హద్దులు పాతారని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులను సముదాయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



రైతు డాగ్గారి నారాయణ

పెద్దశంకరంపేట(మెదక్): హెచ్‌ఎండీఏ అధికారులు సర్వే చేసి హద్దులు పాతారనే సమాచారం తెలిసి భూమి ఎక్కడ పోతుందోనని ఆందోళనతో ఓ రైతు గుండె ఆగిపోయింది. ఈ సంఘటన పెద్దశంకరంపేటలో గురువారం తెల్లవారుజాము చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన డాగ్గారి నారాయణ(75)కు పట్టణ శివారులో కొన్ని ఎకరాల భూమి ఉంది. ఇందులో అతడి తమ్ముడికి కూడా కలిపి 3 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. బుధవారం హెచ్‌ఎండీఏ అధికారులు సర్వే చేసి హద్దులు పాతారనే సమాచారం తెలియడంతో భూమి ఎక్కడ పోతుందోనని ఆందోళనతో గుండెపోటుకు గురై మృతిచెందాడని తెలిపారు.

రైతుల ఆందోళన

అధికారులు సర్వే సక్రమంగా చేపట్టకుండా తమ భూముల్లో హద్దులు పాతారాని సుమారు 70 మంది రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎస్‌ఐ బాలరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్‌లు వారికి నచ్చజెప్పారు. రైతులు సాగు చేసుకుంటున్న అసైన్డ్, పట్టా భూముల విషయంపై ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు నివేదించి వారికి న్యాయం చేస్తామని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు.

విషయానికొస్తే..

పట్టణ శివారులో గత ఏడాది హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ)కు 217 సర్వే నంబర్‌లో 257 ఎకరాల 18 గుంటల భూమిలో.. 85 ఎకరాల సాగుకు పనికిరాని భూమిని అభివృద్ధి కోసం రెవెన్యూ అధికారులు అప్పగించారు. ఈ విషయమై కొంతకాలంగా రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ భూమిని సర్వే చేపట్టేందుకు బుధవారం హెచ్‌ఎండీఏ అధికారులు జేసీబీలతో వచ్చి పలు చోట్ల హద్దులను గుర్తించి జెండాలను పాతారు.

అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలి



ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్‌సభ్యులు

గజ్వేల్‌రూరల్: భవన నిర్మాణానికి స్థలంతోపాటు నిధులు కేటాయించేలా చొరవ చూపాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ స్టీల్ అండ్ సిమెంట్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తమ అసోసియేషన్‌లో 75 దుకాణాలున్నాయని తెలిపారు. అధ్యక్షుడు అత్తెల్లి కిషన్, ఉపాధ్యక్షుడు గంజి లక్ష్మయ్య, కార్యదర్శి బాలన్‌రావు, కోశాధికారి చంద్రమౌళి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మీర్జాపూర్‌లో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రమేశ్

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పలు పంచాయతీల అభివృద్ధి పనులను జెడ్పీ సీఈఓ రమేశ్ బృందం గురువారం పరిశీలించింది. జిల్లెలగడ్డ, రాములపల్లి, మాలపల్లి, మీర్జాపూర్, వంగరామయ్యపల్లి, మీర్జాపూర్, భల్లునాయక్ తండాల్లో పర్యటించింది. ఈ గ్రామాల్లోని వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, నర్సరీలను పరిశీలించింది. పంచాయతీ కార్యదర్శుల ప్రగతిపై రికార్డులను తనిఖీ చేసి కార్యదర్శుల పనితీరును నమోదు చేసుకుంది. వీరి వెంట ఎంపీడీఓ కుమారస్వామి, ఏపీఓ పద్మ తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పట్టణంలోని గురువారం జరిగింది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్.. రెండురోజుల క్రితం తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాడు. తర్వాత ఈనెల 15న నర్సాపూర్ చౌరస్తా సమీపంలో అద్దె ఇంటికి వెళ్లినా కనిపించలేదు. ఫోన్ స్విచ్చాఫ్ అని వస్తోంది. దీంతో ఆందోళన గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఆర్థిక ఇబ్బందులతో మదనపడుతున్నట్లు తెలిసింది.

గిరిజన బంధు అమలుకు పోరాటం

గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్

హుస్నాబాద్: గిరిజన బంధు అమలు చేస్తూ తక్షణమే జీఓ జారీ చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు గిరిజనులు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ పిలుపునిచ్చాడు. పట్టణంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన బంధును అమలు చేస్తామని గతేడాది సెప్టెంబర్ 17న సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోకపోవడం దుర్మార్గమన్నారు. గిరిజన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే సీఎంపై ఒత్తిడి తెచ్చి పథకం అమలుకు జీఓ జారీ చేయించాలన్నారు. సమావేశంలో నాయకులు శివరాజ్, బానోతు వెంకటేష్, యాదగిరి, రవి, బాలు, రమేష్, రాజు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

సిద్దిపేట అర్బన్ : జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు గాను శనివారం మిట్టపల్లి రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు మెదక్ ఈస్ట్ రీజియన్ ప్రాంతీయ సమన్వయకర్త కె.నిర్మల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరే విద్యార్థులు పదో తరగతి రెగ్యులర్‌గా ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 12 గంటల తరువాత సీట్ల కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక ఐఐటీ శిక్షణ కోసం దరఖాస్తుకు కూడా శనివారంతో గడువు ముగుస్తోందని ప్రాంతీయ సమన్వయకర్త నిర్మల పేర్కొన్నారు.

పాత నేరస్తుడి అరెస్టు

అదుపులో తీసుకున్న పోలీసులకు అభినందన



హోంగార్డు రమేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

కామారెడ్డి క్రైం : భిక్కనూరుకు సమీపంలోని ఓ దాబా వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా బ్లూకోర్టు కానిస్టేబుల్ గణేశ్, హోంగార్డు రమేష్ గుర్తించారు. అతడిని పట్టుకుని వేలి ముద్రలను తనిఖీ చేయగా, పాత నేరస్తుడని తేలింది. అదుపులోకి తీసుకున్నారు. నర్సాపూర్‌కు చెందిన మోహన్‌గా గుర్తించారు. దొంగతనాలు చేసేందుకు వచ్చినట్లు విచారణలో తేలింది. కాగా, కానిస్టేబుల్, హోంగార్డులను గురువారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు.

అర్ధరాత్రి ఇంట్లో చోరీ

నవాబుపేటలో ఘటన



బాధితులు ఎల్లమ్మ, బాలవీరయ్య

శివ్వంపేట (నర్సాపూర్): వ్యవసాయ పొలం వద్ద నివాసం ఏర్పరచుకుని ఉంటున్న దంపతులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నగలు, నగదు అపహరించారు. ఈ సంఘటన శివ్వంపేట మండలం నవాబ్‌పేట శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన శర్వాణి ఎల్లమ్మ బాలవీరయ్య దంపతులు. గ్రామ శివారులోని వారి వ్యవసాయ పొలం వద్ద షెడ్డు వేసుకొని అక్కడే నివాసం ఉంటున్నారు. అర్ధరాత్రి వారు గాఢనిద్రలో ఉండగా.. గుర్తుతెలియని మహిళ మరో వ్యక్తి షెడ్డులోకి చొరబడ్డారు. దంపతులపై దాడి చేసి కత్తితో బెదిరించారు. ఎల్లమ్మ మెడలో ఉన్న బంగారం, వెండి వస్తువులు, మూడు వేల నగదు, వంట నూనె, పలు కిరాణం సరుకులను ఎత్తుకెళ్లారు. విషయం బయటకు చెబితే చంపేస్తామంటూ బెదిరించి ఉడాయించారు. గురువారం క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలు ఆధారాలు సేకరించాయి.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రామాయంపేట(మెదక్): మహిళ హత్య కేసులోని నిందితుడిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చూపారు. ఈ సంఘటన రామాయంపేట మండలంలో జరిగింది. సీఐ లక్ష్మీబాబు కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. మండలంలోని దామరచెరువు గ్రామానికి చెందిన కుస్తి లక్ష్మి (50) మృతదేహాన్ని శివ్వాయపల్లి బాలసముద్రం వద్ద గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. కేసు విచారణలో భాగంగా రామాయంపేటలోని కల్లు దుకాణాల వద్ద సీసీ కెమరాలను ఆధారంగా చేగుంట మండలం కిష్టాపూర్‌కు చెందిన అంకం ఎల్లంను అదుపులోకి తీసుకున్నారు. గతంలో అప్పుగా తీసుకున్న రూ. లక్ష తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి తలపై రాయితో కొట్టి చంపినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

వ్యవసాయం.. పరిశ్రమలా మారాలి

- ఇజ్రాయెల్‌లో ఉమ్మడి వ్యవసాయం
- సమానంగా లాభాలు
- వాణిజ్య పంటలే అధికం
- రైతులే ఉత్పత్తి, మార్కెటింగ్ చేస్తారు
- 'సాక్షి'తో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి



ఇజ్రాయెల్‌లో పంటలను పరిశీలిస్తున్న వంగ నాగిరెడ్డి, అధికారులు(ఫైల్)

ఇజ్రాయెల్‌లో ఉమ్మడి వ్యవసాయం చేసుకుంటున్నారు. లాభాలను సమానంగా పంచుకుంటున్నారు. ముఖ్యంగా వాణిజ్య పంటలు వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ వ్యవసాయానికి అవసరమైన నీరు, విద్యుత్, లీజు భూమికి డబ్బులు చెల్లిస్తున్నారు. మన వద్ద పెట్టుబడి కోసం రైతుబంధు, ఉచిత విద్యుత్ సరఫరా అందుతోంది. అయితే మన రాష్ట్రంలో వ్యవసాయం ఒక పరిశ్రమలా తయారు కావాల్సిన అవశ్యకత ఉంది.

సాక్షి, సిద్దిపేట

'ఇజ్రాయెల్‌లో రైతులు పంటల ఉత్పత్తితో పాటు వారే స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటున్నారు. అక్కడ నీటికి, విద్యుత్‌కు చార్జీలు చెల్లిస్తున్నారు. భూమికి లీజు డబ్బులు కడుతున్నారు. పంటలకు రసాయనిక మందుల వినియోగం చాలా తక్కువ, విదేశాలకు ఎగుమతయ్యే వాణిజ్య పంటలనే ఎక్కువగా పండిస్తున్నారు'అని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి తెలిపారు. ఇటీవల ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కమిషనర్ హన్మంతరెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని 29 మంది అధికారులు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు.. ఇజ్రాయెల్ దేశ స్టడీ టూర్ వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా వంగ నాగిరెడ్డిని 'సాక్షి'పలకరించింది.

స్వయంగా వారే మార్కెటింగ్

ఇజ్రాయెల్ దేశంలో రైతులు పంటలను పండించడంతోపాటు వారే స్వయంగా ప్యాకింగ్ చేసి మార్కెటింగ్ చేసుకుంటున్నారు. ఎక్కువగా వాణిజ్య పంటలను సాగు చేయడం ఒక పరిశ్రమలా కనిపిస్తోంది. అక్కడ భూములు అన్ని ప్రభుత్వానివే. సాగు నీటికి, విద్యుత్‌కు బిల్లులు చెల్లించాలి. లీజుకు తీసుకున్న భూమికీ డబ్బులు చెల్లించాలి. అక్కడ రైతులకు ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీలు అందించడం లేదు. అక్కడ కిబుజ్ వ్యవసాయం చేస్తారు. అందరు కలిసి వ్యవసాయం చేస్తున్నారు. వచ్చిన లాభాన్ని అందరు సమానంగా పంచుకుంటున్నారు.

రసాయన మందుల వినియోగం తక్కువ

ఇజ్రాయెల్‌లో తెగులు, పురుగుల నివారణ కోసం రసాయన మందుల వినియోగం చాలా తక్కువగా ఉంది. స్థానికంగా రైతులే డబ్బులు చెల్లించి వ్యవసాయ సలహాదారులను నియమించుకుంటున్నారు. సేంద్రియ వ్యవసాయమే చేస్తున్నారు. చివరి ఆప్షన్‌గా మాత్రమే రసాయనపురుగు మందులను స్ప్రే చేస్తున్నారు. ప్రతి పంటకు డ్రిప్ ద్వారానే సాగు నీటిని, అలాగే రసాయన ఎరువు సంబంధిత ద్రవణాలను పంపింగ్ చేస్తున్నారు. మన కంటే ఉష్ణోగ్రతలు ఎక్కువ.. ఎడారి భూములు ఉన్నాయి. మన దేశంలో వ్యవసాయానికి అనువైన భూమి వాళ్ల కంటే 150 రెట్ల ఎక్కువగా ఉంది.

విదేశాలకు ఎగుమతి అయ్యే వాటిపైనే దృష్టి

విదేశాలకు ఎగుమతి అయ్యే వాణిజ్య పంటల పైనే అక్కడి రైతులు ఎక్కువ దృష్టి పెట్టారు. పాలిహౌజ్‌లలో చెర్రీ టమాటా, క్యాప్సికమ్, అవక్కాడో, ద్రాక్ష, క్యాబేజీ తదితర పంటలు పండిస్తున్నారు. ఐరోపా, మిడిలిస్ట్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు.

రైతులకు అండగా సీఎం కేసీఆర్



'దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలుస్తున్నారు. రైతు బంధు, ఉచిత విద్యుత్, సాగు నీటి సరఫరా చేస్తున్నారు. మన రైతులు సైతం వాణిజ్య పంటల వైపు దృష్టి పెట్టాలి. అలాగే రైతులే సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటే అధికంగా లాభాలు పొందే అవకాశం ఉంటుంది. ఇజ్రాయెల్ మాదిరిగా వ్యవసాయం ఒక పరిశ్రమ మాదిరిగా చేయాలి. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు కృషితో కాళేశ్వరం జలాలతో తెలంగాణ ప్రాంతం అన్ని పంటలకు అనువైన ప్రాంతంగా మారిందని నాగిరెడ్డి తెలిపారు.